# మామూలు

ఏ. వి. సీతారామయ్య, యం.ఏ., ఎల్.ఎల్.బి.

—(౦)—

పరీక్షపంతులు రేపు వస్తాడని పిల్లలందరికీ చెప్పివేశారు ముగ్గురు మాస్టర్లుకూడా. హెడ్మాస్టరు విశ్వనాథం గారు బడిలోని పిల్లల్ని తక్కిన యిద్దరు మేష్టర్లనీ కూడ తన క్లాసు గదిలో కూర్చి పరీక్షపంతులు వస్తున్నాడు కాబట్టి అందరూ శుభ్రమైన దుస్తులతో రావాలనీ, ఆయన వచ్చినపుడు చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలనీ బోధపరిచాడు. తర్వాత ఎవరిక్లాసులకు వాళ్లు వెళ్లిపోయారు రెండవ మాస్టరు వెంకటేశ్వర్లు మళ్లీ తన కుర్రవాళ్లకు హెచ్చరించాడు. మూడవ మేస్టరు కమలమ్మ బాలికలను ప్రత్యేకంగా ఉద్బోధించింది తలలు చక్కగా దువ్వుకొని బొట్లు పెట్టుకొని పరిశుభ్రమైన గుడ్డలు వేసుకొని మరీ రావాలని చెప్పింది. కమలమ్మ తక్కిన పంతులమ్మల మాదిరి కాదు. తన పని జాగ్రత్తగా తయారుచేసి మంచి పేరు సంపాదించు కొందామనే ఉద్దేశం కలిగినటువంటిది. అందువలన తన బాలికల విషయంలో అంత శ్రద్ధ కలిగివుండటం.


తెల్లవారేప్పటికి వూళ్లో ప్రతియింట్లో అల్లకల్లోలంగా వుంది బడికి వెళ్లేందుకు తయారయే పిల్లలతోటి కొత్త చొక్కాలు లాగూలు టోపీలు వగైరాలన్నీ బయటికి తీశారు. అవి కాదనీ యివీ యివి కావనీ అవీ తొడగటం విడవటంతో సరిపోతుంది కొందరికి పిల్లలను తృప్తిపరచేప్పటికి పెద్దవాళ్లకి తలప్రాణం తోకకి వస్తున్నది. పల్లెటూళ్లో బడికి పరీక్షపంతులు రావడమంటే రాజుగారి పుట్టినరోజు పండగతో సమానమైనంత హడావిడి జరుగుతుంది. అందులో వచ్చేది కొత్త పరీక్ష పంతులు. కొంతవరకు పేరు బడ్డవాడు అందువలన ఏం లోపం వస్తుందో అని హెడ్మాస్టరు విశ్వనాథంగారు మరీ ఆందోళన పడుతున్నారు. తక్కిన మాస్టర్లిద్దరూ ధైర్యం చెపుతున్నారు అయినా ఏదో టోపీ వేయలేక బోతామా అని తనకు తానే మళ్లీ సమాధాన పరుచుకుంటూన్నాడు హెడ్మాస్టరు పిల్లలంతా ఒకరి తరవాత నొకరు అంతా చేరుకున్నారు ఏడుగంట లయేసరికి ఇంకా రావల్సిన వాళ్లుంటే కబురు పెట్టిస్తున్నారు త్వరగా రమ్మని మేస్టర్లు. నూకాలు బంట్రోతుకూడా నడుముకు గుడ్డ బిగించి తలగుడ్డ సర్దుకుని సిద్ధంగా నుంచున్నాడు.

అప్పుడే ఏడున్నరయింది. ఇంకా రాలేదామా అని అంతా ఆలోచిస్తున్నారు. పిల్లలు అడిగే ప్రశ్నలకి సమాధానాలు యివ్వలేక మేష్టర్లు విసిగిపోతున్నారు. హెడ్మాస్టరు బల్లమీద పంపరపనసపళ్లు బత్తా నారింజకాయలూ, యాపిల్సు, సీమ రేగుపండ్లు, జీడిపప్పూ, ఒక సిజరు సిగరెట్లపెట్టె ఒక అగ్గిపెట్టె పెట్టివున్నాయి. బల్లకింద ఒక డజను సోడాలు పెట్టి వుంచారు. ఆక్లాసులో పిల్లలంతా వాటి వంకే చూస్తున్నారు పాపం. ఇంతలో మోటారుకారు చప్పుడైంది. దాంతో అంతా గంద్రగోళం. బళ్లో పిల్లలంతా వక్కమారు లేచారు, ఇంతవరకూ చెప్పిన నీతి వాక్యాలన్నీ మరచిపోయి. మేష్టర్లంతా పరీక్ష పంతులుకి ఎదురుగా పోయేటట్టయితే బళ్లో పిల్లలంతా కూడా లేచి వస్తారేమోనని హెడ్మాస్టరుగారు మాత్రమే ఎదురువెళ్లారు. వెంకటేశ్వర్లగారూ కమలమ్మగారూ ఎవరిక్లాసులో వారు కూర్చున్నారు.

పరీక్ష పంతులు నారాయణ రావుగారు—ఆ పచ్చని బిగుతుపాటి సూటు, నల్లని టై, దొరటోపీ మెళ్లో జరీ కండువా కోరలవంటి పెద్ద పళ్లూ—మొత్తానికి జనాన్ని ఆకర్షిస్తున్నాడని చెప్పక తప్పదు. వచ్చి హెడ్మాస్టరు గారి కుర్చీలో కూర్చున్నాడు. నూకాలు బంట్రోతు బత్తా నారింజకాయలు వొలిచిస్తుంటే తింటూ హెడ్మాస్టరు ఏదో చెప్పుకుంటుంటే వింటున్నాడు. పిల్లలంతా దిగులు పడ్డ మొఖాలతో పరీక్షపంతుల వంకా క్రింది నారింజకాయల చెక్కులవంకా చూస్తూ గుటకలువేస్తూ కూర్చున్నారు. ఇంతలో తమ క్లాసులలోని పిల్లల్ని జాగ్రత్తగా కూర్చోమని చెప్పి వెంకటేశ్వర్లు కమలమ్మ గూడా హెడ్మాస్టరుగారి క్లాసు గదిలోకి వచ్చి పరీక్షపంతులు నారాయణ రావుగారికి నమస్కరించి నుంచున్నారు. ఆయన తల వూపి జీడిపప్పు తింటూ కమలమ్మగారి వంక చూస్తూండగా ఆమె మళ్లీ నమస్కారం చేసి తన క్లాసులోకి పోతానని అనుజ్ఞ కోరి వెళ్లిపోయింది. నారాయణ

రావుగారు వేంకటేశ్వర్లనిగూడా తన క్లాసులోనికి పోయి వుండమన్నారు. 'చిత్త'మని ఆయన వెళ్లిపోయాడు.

నారాయణ రావుగారు రెండు సోడాలు పుచ్చుకొని బంట్రోతును బయటికి పోయి కూర్చొనమని చెప్పి తాను విశ్వనాథంగారితో ఏదో రహస్యంగా మాట్లాడుకో మొదలెట్టాడు.



ఇంతలో పదిగంటలైంది. నారాయణ రావుగారూ విశ్వనాథంగారూ నారాయణ రావుగారి జవానూ మోటారులో ఎక్కారు. మోటారుముందు బడి పిల్లలూ ఇద్దరు మేష్టర్లూ వారికి ముందు సన్నాయి మేళంవాళ్లూ అంతా వూరేగింపుగా రెండు బజార్లు తిరిగి పరీక్ష పంతుల్ని విశ్వనాథంగారింట్లో చేర్చారు. ఇదంతా కమలమ్మగారికి చాలా కష్టంగా వుంది. కాని చేయకల్గిన దేమీ లేదు కదా అని వూరుకుంది.

రెండు గంటలకి మళ్లీ వూరేగింపుతో నారాయణ రావుగారిని బడికి తీసుకువచ్చారు విశ్వనాథంగారి యింటినుంచి. మళ్లీ కొన్ని బత్తా నారింజకాయలూ సీమ రేగుపండ్లు వగైరాలు ఖర్చు చేశాడు నారాయణ రావుగారు. సోడాలు త్రాగి త్రేన్చాడు. సాయంత్రం ఐదుగంటలు కాగానే నారాయణరావుగారు షికారు వెళ్లిపోయాడు తన కారులో జవానుతోకూడా కలిసి. పిల్లల్ని వదలివేశారు 'రేపుకూడా యీ విధంగానే పెందలాడే రాండి' అని చెప్పి. సగం పరీక్ష అయిపోయింది కదా అని చెప్పి మేష్టర్లు సంతోషించారు. బడికి తాళాలు వేయించి మేష్టర్లుకూడా సాగిపోయారు.

చీకటిపడ్డది. కమలమ్మగారు వంటచేస్తూ కూర్చుంది వంటయింట్లో. తమ్ముడు ఇరవై ఏళ్లవాడు. బావగారు గుంటూరునుంచి వ్రాసిన ఉత్తరం చదివి వినిపిస్తున్నాడు అక్కయ్యకు ఇంతలో హెడ్మాష్టరు విశ్వనాథంగారు 'కమలమ్మగారూ' అని పిలిచినట్లుగా కేక వినబడ్డది. లేచి తలుపు తీయబోయేప్పటికి లాంతర కాలికి కొట్టుకొని క్రింద పడిపోయింది. మళ్ళీ దాన్ని యథావిధిగా కుర్చీపీటమీద వుంచి తలుపు తీసి సావిట్లో వేసివున్న చాపమీద కూర్చోమని తమ్ముడ్ని పొయ్యి చూస్తుండమని చెప్పి తాను మళ్ళీవచ్చి విశ్వనాథంగారితో,

"ఏం యింత చీకటిపడి వచ్చారు? పరీక్ష పంతులు తృప్తిపడ్డాడా మన మర్యాదతో?"

"ఏం తృప్తిపడడం లెండి? ఇదంతా ఆయనకి మామూలేగా!"

"అట్లా సందేహంగా మాట్లాడుతున్నారు కారణం?"

"కారణం ఏమీలేదు లెండి. మీవలన యిప్పుడు మన స్కూలు మర్యాద కాపాడుకొన వలసిన అవసరం వచ్చింది. అంతా మీ చేతులో వుంది."

"ఏమిటండీ అది? ఓ పాతిక బత్తా నారింజకాయలు కావాలంటాడా?"

"అది గాదు.. ."


"...... .. "

"...... ..."

"ఒకవేళ వాడు అంత దుర్మార్గపు కోరిక కోరితే మీకెట్లా నోరు వచ్చిందండీ. ఇందుక నేనా యింత శ్రమపడి వచ్చారు. చాలు పదండి."

"ఏం మహా పెద్ద పతివ్రతలాగ మాట్లాడుతున్నావ్. నిన్న గాక మొన్న వచ్చావో లేదో ఉద్యోగంలోకి. ఒప్పుకోకపోతే చూడు నా తడాఖా." ఆలోచించింది కమలమ్మ. విశ్వనాథం దుర్మార్గుడు. చాలాకాలంనుంచి ఆవూళ్లో వున్నవాడు. ఎంతకన్నా సాహసించగలడు. కష్టించి నాలుగుడబ్బులు సంపాదించుకోటానికి గూడ యిట్లా వచ్చింది గదా అని విచారించింది. భర్తగూడా వూళ్లో లేడు. అన్నిటికీ భగవంతుడే వున్నాడు. ఆ సమయానికి ఏదో వో ఉపాయం తోపక చేయబోతాడా అనుకుని.

"సరే కానీయండి. రాత్రి పదిగంటలకి మా యింటికి రమ్మనండి"



"ఆఁ అట్లా అను. దీనివలన నీకుమాత్రం లాభం లేనట్లే" అంటూ వెళ్ళిపోయాడు విశ్వనాథం.

కమలమ్మ విచారంతో లోనికి వెళ్ళిపోయింది. ఇంతవరకు అంతా వింటూనే వున్నాడు తమ్ముడు. "అక్కయ్యా, దీని కింతగా విచారపడాలా? రాత్రికి నీవు పరుండబోయేముందే చేస్తానుగదా ఏర్పాటంతా" అంటూ వెళ్ళిపోయాడు. కాని కొంచెం సేపటిలోనే చాకలి సుబ్బాయిని తీసుకొచ్చి పడకగదిలో ఒక మూలనున్న మైలగుడ్డల బుట్టలో కూర్చోబెట్టాడు. వాడు ఒక చిన్న లారీ అనుకుని దాంట్లో కూర్చున్నాడు. కమలమ్మ తమ్ముడు కమలమ్మ దుస్తులు నగలు వగైరాలు ధరించాడు. టోపాకూడా పెట్టడం మూలాన అచ్చు కమలమ్మమూర్తిగా తయారయాడు.

ఇంతలో దగ్గుకుంటూ నారాయణరావు అతని జవానూ వచ్చారు. కమలమ్మ తను మరో గదిలోకి వెళ్ళిపోయింది. విశ్వనాథం బయటినుంచే వెళ్ళిపోయాడు వాకిలివరకూ వచ్చి. నారాయణరావు వరండాలోకి వచ్చాడు. చూచాడు

బాగా మస్తాబై వుండటం. ఒక చిరునవ్వు పారేశాడు. దానికి తిరిగీ చిరునవ్వు పొందాడు. చెప్పులు విడిచి లోనకు బోయాడు జవానును వాకిట్లో కూర్చోమని. వాడు వాకిట్లో అరుగుమీద తల వాల్చాడు. గదితలుపు గడియబడ్డది.

నారాయణరావు పైకండువా అక్కడి కుర్చీమీద పడేసి ఆమెవంక చూడ మొదలు పెట్టినాడు.

"అయ్యో, అలా దూరం దూరం తొలుగుతావేం? దా, దా, కూర్చో."

"అయితే మీకీమామూలుగూడా వుందేమండీ? కేవలం జీడిపప్పూ నారింజకాయలే ననుకున్నాను."

"ఏం మామూళ్లు లే. కాని నాజన్మలో యిటువంటి ఆప్యాయమైన మామూలు మాత్రం ఎన్నడూ పొందలేదు. దా, కూర్చో."

"ఎన్నడూ యిటువంటి మామూలు పొందలేదుగా! నిజంగా?"

"నాతోడు. ఎన్నడూ పొందలేదు."

"అయితే మీకేం సిగ్గవడంలేదు యిటువంటి పనులు చేయడానికి. అసలే ఏవో నాలుగు డబ్బులు తెచ్చుకుని అవస్థ పడుతుండే యీలాటి బీద ఉపాధ్యాయులనుంచి బత్తా నారింజకాయలూ సీమ రేగుపండ్లూ సోడాబుడ్లూ మోటారు ఖర్చులూనా? సర్కారువారు మీకిచ్చే భత్యపు ఖర్చంతా నిలువ చేసుకోటానికేనా యిచ్చేది? ఇటువంటి పనులకేనా మీ సర్కీట్లు? పైగా ఉపాధ్యాయినీలను యీ విధంగా వేధించడమా? మామూలా? సిగ్గుండనక్కరలేదూ?......"

"ఇదిగో తరువాత నీ యిష్టమొచ్చినంత ఉపన్యాసం యివ్వు. దెంపలు వాయగొట్టు, దా" అంటూ యింక పట్టలేక పాములాగ వేలాడుతున్న జడ పట్టుకున్నాడు. చేతిలోకి వూడి వచ్చింది జుట్టు. క్రాపింగుతో స్త్రీ మస్తుతో వక మగవ్యక్తి "ఇటువంటి మోసమా? గుర్గురాలా" అంటూ గద్దించాడు నారాయణరావు నిలువెల్లా కంపిస్తూ. ఇంతలో మూలనున్న బుట్ట కిరకిరమని శబ్దం చేసింది. ఏమిటా అని నారాయణరావు వెనుకకు తిరిగి చూచాడు. స్తంభంలోనుంచి వెలువడుతున్న నరసింహస్వామిలాగ బుట్టలోనుంచి చాకలి సుబ్బిగాడు లాటీతో ప్రత్యక్షమయాడు. వాడిని చూడంగానే నారాయణరావు పంచప్రాణాలు కదల బారినయి. ఆ తత్క్షణం లోనే తలమీద లాటీ వాలింది. వొళ్లంతా హూనం, హూనం. పక్క గదిలో నవ్వు.

తలుపులు తెరచి మెడమీద చెయి వేసి బయటకు వక గెంటు గెంటారు. బయలుదేరి తన జవాన్ను అరుగు మీంచి లేపి, 'పదరా పోదాం' అన్నాడు నారాయణరావు. "ఎక్కడికి?"

"ముందు పద. ఇదుగో నీ కేమైన గంద్రగోళం వినిపించిందా?"

"లేదండి."

"పోనీ లే. ఏదో పక్కయింట్లో గలభాగా వుంటేను అందుకని అడిగా నిన్ను. డ్రైవరును లేపు వాడెక్కడ వున్నాడో చూసి."

"మీరు రేపుకూడా వుంటారని వాడెక్కడికో పోయాడండి పడుకోడానికి."

"ఏడిచినట్లే వుంది. వెధవ బుద్ధులూ వీడూను. తీసుకురా పెట్టె పక్కచుట్టా, నడిచిపోదాం"

"... . ..... ....."

"చూస్తావేం. మాట్లాడకుండా తీసుకురా, నడు."

"ఎన్నడూ కాలినడక మామూలు. ...."

"ఓరి నీ మామూలు పాడు గాను; నోరుమూసుకు నడవరా"

జవాను పెట్టె తీసుకు ముందు నడిచాడు. అర్ధరాత్రి సమయం బయలుదేరాడు పరీక్షకుంతులు కాలి నడకన మామూలు లేకపోయినా.

